క్లుప్తంగా


పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలి



పిల్లలతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించుకోవాలని లైబ్రేరియన్ సి.హెచ్.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనం, చిత్రలేఖనం, వ్యాసరచనపై తర్ఫీదు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విరామకాలాన్ని సద్వినియోగం చేసుకునేందుకు గ్రంథాలయాలకు రావాలని, గ్రంథాలయంలోని పుస్తకాలు చదవడం ద్వారా అపారమైన జ్ఞానం అలవడుతుందన్నారు. పుస్తక పఠనంతో పాటు, వక్తృత్వం, చిత్రలేఖనం, వ్యాసరచన వంటి వాటిపై కూడా ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు.

రూ.17 లక్షలతో రక్షిత మంచినీటి పథకం నిర్మాణం



సీఎస్ఆర్ పురంలో కొత్తగా నిర్మించిన రక్షిత మంచినీటి పథకం ట్యాంకు

రాజాం: మండలంలోని సీఎస్ఆర్ పురం గ్రామంలో జల జీవన్ మిషన్ ద్వారా ప్రభుత్వం రూ.17.01 లక్షలతో రక్షిత మంచినీటి పథకం నిర్మాణం చేపట్టారు. దీని ద్వారా ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటిని అందించే ఏర్పాట్లు చేశామని ఎంపీపీ లావేటి సులోచన తెలిపారు. గ్రామంలో కొత్తగా రక్షిత మంచినీటి పథకం ట్యాంకు నిర్మించడంతో కొన్ని దశాబ్దాలుగా నెలకొన్న తాగునీటి కష్టాలు తీరాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాలు తమ కష్టాలను పట్టించుకోలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమే తమ కష్టాలను తీర్చిందని గ్రామస్తులు చెబుతున్నారు.

చలివేంద్రం ఏర్పాటు

వంగర: మండల పరిధిలోని కొప్పరవలస బస్టాండ్ వద్ద గ్రామానికి చెందిన యువకులు ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎండలు అధికంగా ఉండడంతో ప్రయాణికులు, వాహనచోదకుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు యువకులు తెలిపారు.

ఘనంగా రామాలయ ప్రారంభోత్సవం

బొండపల్లి: మండలంలోని మరువాడ గ్రామంలో రామాలయ ప్రారంభోత్సవాలను రెండో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు హోమాలు చేసి, సీతారామ,లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్క గ్రామాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కొవ్వాడపేట గ్రామానికి చెందిన చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

విద్యాసామగ్రి పంపిణీ

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి ప్రాథమిక పాఠశాలల 23 మంది విద్యార్థులకు సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు సాయి కుమార్ ఆదివారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థు లకు నోట్ పుస్తకాలతో పాటు పెన్నులు, పెన్సిళ్లు, వాటర్ బాటిళ్లు, తదితర సామగ్రిని అందజేశారు. హెచ్ఎం లక్ష్మీప్రసన్న, సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

లక్కవరపుకోట: స్థానిక ఉన్నత పాఠశాలలో 1996–97 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు తమతో కలిసి చదువుకుని, ఇటీవల మృతి చెందిన పోతలవానిపాలెం గ్రామానికి చెందిన పోతల త్రినాథ్ కుటుంబానికి అండగా నిలిచారు. మృతుడు కుటుంబానికి పూర్వ విద్యార్థులు అంతా కలిసి రూ.50 వేల నగదును ఆదివారం అందజేశారు. పూర్వ విద్యార్థులు బండ గోవింద, దొడ్డి జగదీష్, గుమ్మ డి సత్యనారాయణ, బోజంకి సూర్య నారాయణ, తదితరులు మృతుడు త్రినాథ్ నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఆశీర్వదించండి.. మరింత సంక్షేమం, అభివృద్ధిని అందిస్తాం

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్



గుయ్యానవలసలో ఎన్నికల ప్రచారంలో రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్‌కు ఘనస్వాగతం పలికిన గ్రామస్తులు

రాజాం: రానున్న ఎన్నికల్లో తమను ఆశీర్వదించి, గెలిపిస్తే మరింత సంక్షేమం, అభివృద్ధి చేసి చూపిస్తామని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో విజయనగరం ఎంపీ అభ్యర్థిగా ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ తలే రాజేష్ బరిలో ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మండలంలోని వీఆర్అగ్రహారం, గుయ్యానవలస, బొడ్డవలస తదితర గ్రామాల్లో ఆదివారం వారు పర్యటించి, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. జై జగన్.. జై వైఎస్సార్ సీపీ అని నినాదాలు చేస్తూ అభ్యర్థుల్లో ఉత్సాహం నింపారు. ఆ తర్వాత ఇంటింటికీ వెళ్లిన వారు ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, ఆ దిశగా ఆయన అనేకానేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతానికి పైగా హామీలు నెరవేర్చి చరిత్ర సృష్టించారన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకువస్తే పథకాలు, ప్రభుత్వ సేవలు ఇంటి వద్దకే వస్తాయన్నారు. విశాఖపట్నం రాజధాని అయితే మన ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందని, ఇది కావాలంటే సీఎం జగనన్నను మనమంతా కలిసి మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. టీడీపీకి ఓటు వేస్తే జన్మభూమి కమిటీలు మళ్లీ రాజ్యమేలుతాయని, ప్రజాధనం లూటీ అవుతుందన్నారు. గతంలోని టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలు గమనించాలన్నారు. ఇప్పటి సంక్షేమం, అభివృద్ధి కావాలంటే తప్పనిసరిగా మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, మన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం మండల అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, యువజన అధ్యక్షుడు గెడ్డాపు అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కోనారి అప్పారావు, కిలారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎవరెన్ని కుట్రలు చేసినా వైఎస్సార్ సీపీ విజయాన్ని అడ్డుకోలేరు



మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: ఎవరెన్ని కుట్రలు పన్నినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయాన్ని అడ్డుకోలేరని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానికంగా ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతోందని, ప్రజలు కూడా సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్నారన్నారు. టీడీపీ, దాని మిత్రపక్ష పార్టీలు స్వార్థ రాజకీయాల కోసం ఎన్ని కార్యక్రమాలు చేసినా, ఎన్ని అబద్ధపు హామీలు ఇచ్చినా జనం నమ్మరన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు బాగుండాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా సీఎం జగనన్నను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ నేతల కుతంత్రాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ గల్లంతవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్షుంనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కటికి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలి

రేగిడి: ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలని, అలాంటప్పుడే మెరుగైన సమాజం ఆవిష్కృతమవుతుందని ఆధ్యాత్మిక వక్త ఎన్.వి.రమణ అన్నారు. మండలంలోని దేవుదళ గ్రామ గీతాశ్రమంలో ఆధ్యాత్మిక వక్త గొర్లె దామోదరావు ఆధ్వర్యంలో ప్రవచన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన ప్రజలంతా భక్తిభావం పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత తద్వారా మంచి ఆరోగ్యం వస్తుందన్నారు.

సేవాభావం పెంపొందించుకోవాలి

రేగిడి: యువత సేవాభావం పెంపొందించుకోవాలని రాజాం జీసీఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తమరావు అన్నారు. మండలంలోని మునకలవలస గ్రామంలో ఎన్.ఎస్.ఎస్(జాతీయ సేవా పథకం–2) సేవా కార్యక్రమాల ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు విద్యార్థులు గ్రామంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేశారని, వాటికి గ్రామస్తులు ఎంతో సహకరించారని వారందరికీ ధన్యవాదాలన్నారు. కార్యక్రమంలో పీవో తురంగి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పోలమ్మ పండగ

బాడంగి: మండల కేంద్రంలో పోలమ్మ(అమ్మవారి) పండగ సోమవారం నుంచి నిర్వహించనున్నారు. ఆదివారం ఉయ్యాల కంబాల కార్యక్రమంతో ఆరంభమైన ఈ వేడుకలు మూడు రోజుల పాటు చేయనున్నారు. సోమవారం తొలేళ్ల సంబరం, మంగళవారం ఘటాల తిరువీధి, బుధవారం తెల్లవారుజామున ఉజ్జిడిమాను తిరువీధి అనంతరం అనుపోత్సవం నిర్వహిస్తారు.

20 మద్యంసీసాలు స్వాధీనం

మెంటాడ: మండల కేంద్రం శివారులో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, 20 మద్యంసీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆంధ్ర ఎస్ఐ బొడ్డు దేవి ఆదివారం తెలిపారు. ముందస్తు సమాచారంతోనే ఆ వ్యక్తిని పట్టుకున్నామన్నారు. పరిమితికి మించి మద్యంబాటిళ్లు తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

కోదండరామాలయంలో ఎంపీ ప్రత్యేక పూజలు



రాజాం: కోందరామాలయంలో పూజల్లో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని బుచ్చింపేట గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కోదండరామాలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు ఆలయ గర్భగుడిలో సీతారాముల విగ్రహం, ఆలయం బయట ఏకశిలా ధ్వజస్తంభం ప్రతిష్ఠించి, విశేష పూజలు నిర్వహించారు. ఆలయాన్ని సందర్శించిన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ శ్రీరామునికి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలంతా బాగుండాలని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్, ఆలయ అర్చకులు రంపా హనుమంతురావుశర్మ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో శ్రీకోదండ సీతారామస్వామి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం వేదపారాయణ, క్షీరాధివాసం, మండప పూజలు, ఏకపాద సూర్యనమస్కారాలు చేపట్టారు. ఖండ్యాం ప్రాంతానికి చెందిన శారదా పీఠం వ్యవస్థాపకులు, సహస్ర చండీ మహాయజ్ఞ బిరుదాంకితులు అంపోలు రుద్రకోటేశ్వర శర్మ ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు వేమకోటి సుబ్రహ్మణ్య శర్మ నేతృత్వంలో ఈ కార్యక్రమాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గార రమణ, డీలర్ల సంఘం అధ్యక్షుడు సింగంవలస రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.



రేగిడి: పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా మట్టల ఆదివారం

వాడవాడలా మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు యెరూషలేము(జెరూసలేం)లో ప్రవేశించిన రోజును గుర్తు చేసుకుని, ఏటా గుడ్‌ఫ్రైడేకి మూడు రోజుల ముందు ఈ కార్యక్రమాన్ని క్రైస్తవులు జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం మతవిశ్వాసులంతా ఈత కొమ్మలు, కొబ్బరి కొమ్మలు చేతపట్టుకుని, భక్తిగీతాలతో జీసస్‌ను ఆరాధిస్తూ వీధుల్లో ఊరేగారు. క్రీస్తు సువార్తను వినిపించి, ప్రభు ఆశీస్సులు అందరిపైనా ఉండాలని ప్రార్థించారు. –సాక్షి నెట్‌వర్క్.



తెర్లాం: కూనాయవలసలో మట్టలు చేతపట్టుకుని వీధుల్లో ఊరేగుతున్న మతవిశ్వాసులు



బాడంగి: దొంకినవలస చర్చిలో క్రీస్తు సందేశం వినిపిస్తున్న పాస్టర్ స్టీవెన్‌సన్



బొబ్బిలి: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవులు

ప్రజలందరిపైనా శ్రీలక్ష్మీగణపతి ఆశీస్సులు



తెర్లాం: శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: ప్రజలందరిపైనా శ్రీలక్ష్మీ గణపతి చల్లని ఆశీస్సులు ఉండాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరుకున్నారు. మండలంలోని విజయరాంపురం గ్రామంలో కొత్తగా నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు వేదపండితులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. స్వామి వారి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం శ్రీలక్ష్మీ గణపతికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి, రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించేలా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బూరి శ్రీనివాసరావు, ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, మండల వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, డీసీసీబీ డైరెక్టర్ బోను అప్పలనాయుడు, విజయరాంపురం సర్పంచ్ బూరి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు

- రాజాం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్.జోసెఫ్



మాట్లాడుతున్న ఎన్నికల ఆర్వో జోసెఫ్

రాజాం: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని రాజాం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్. జోసెఫ్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సాక్షి విలేకరులతో ఆదివారం మాట్లాడిన ఆయన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. నియోజకవర్గంలో రాజాం మున్సిపాలిటీతో పాటు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాలు ఉండగా, వీటిల్లో మొత్తం 2,24,227 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ప్రస్తుతం కొత్త ఓటరు నమోదు కూడా జరగడంతో మరో 1600 ఓట్లు పెరిగే అవకాశం ఉందన్నారు. 2019 ఓటర్లతో పోలిస్తే 4,600 ఓట్లు పెరిగాయన్నారు. నియోజకవర్గంలో 16 మంది కన్నా ఎక్కువ మంది పోటీచేస్తే ఈవీఎంల సంఖ్య పెరుగుతుందని, ఎంతమంది పోటీచేసినా ఇబ్బందేమీ లేదన్నారు. ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానంపై ప్రజలకు ఇప్పటికే అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ దఫా ఎన్నికల్లో రాజాం నియోజకవర్గంలో శతశాతం ఓటింగ్‌కు అవకాశం ఉందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లు కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని 284 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయించామన్నారు. ఎన్నికల ప్రచారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ మాత్రమే చేయాలని, ప్రచారానికి సంబంధించి, అభ్యర్థులు ముందస్తు అనుమతులు పొందాలని లేకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు. వంగర, సంతకవిటి, రాజాం మండలాల్లో సమస్యాత్మక గ్రామాలు గుర్తించామని, ఆ గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూస్తున్నామన్నారు.

ఎన్నికల కోడ్ అమలులో ఉందని తెలీదా?



జనసేన కార్యకర్తలకు ఎన్నికల నిబంధనలు వివరిస్తున్న ఎస్ఐ దేవి

మెంటాడ: మండలంలోని జగన్నాథపురానికి వెళ్లే దారిలో చంపావతి నదిపై ఉన్న కల్వర్టు మరమ్మతులు, రోడ్డుకు ఇరువైపులా తుప్పలు తొలగించే పనులకు సిద్ధమైన జనసేన పార్టీ కార్యకర్తలను స్థానిక ఎస్ఐ బొడ్డు దేవి అడ్డుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా, అనుమతులు తీసుకోకుండా ఇటువంటి పనులు చేయకూడదని తెలీదా అని వారిని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఎన్నికల కోడ్‌కు ఈ పనులకు సంబంధమేంటని ఎస్ఐతో జనసైనికులు వాగ్వాదానికి దిగారు. ఇక్కడి నుంచి వెంటనే వెళ్లిపోవాలని, అనుమతులు తీసుకుని వస్తే మీ పనులు మీరు చేసుకోవచ్చని ఎస్ఐ స్పష్టం చేశారు. అనంతరం ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం విడుదల చేసిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిలోని నిబంధనలను వారికి వివరించారు. ఆ తర్వాత వారు అక్కడికి తీసుకువచ్చిన జేసీబీ, ట్రాక్టర్లతో వెనుదిరిగారు. ఇదిలా ఉండగా, నెలరోజుల క్రితమే ఈ పనులు ప్రారంభించామని జనసైనికులు చెప్పగా, గ్రామానికి చెందిన యువత చందాలతో ఈ పనులు చేసుకుంటున్నారని తెలిసింది.

కరుణించమ్మా..కనకమహాలక్ష్మి



రావి చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు

- ఘనంగా అమ్మవారి మారు జాతర
- అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు



పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి అమ్మవారు



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

చీపురుపల్లి: పట్టణంలో కనకమహాలక్ష్మి అమ్మవారి మారు జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏటా అమ్మవారి జాతర ముగిసిన తర్వాత ఆదివారం మారు జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. తెల్లవారు జామున 4 గంటల నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. తెల్లవారు జామున 4 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులు అమ్మవారికి చీరలు, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానం ప్రాంగణంలో ఉన్న రావి చెట్టు వద్ద మహిళలు పూజలు చేసి, కొబ్బరి కాయలు కొట్టారు. ఆలయం వద్ద దేవస్థానం కమిటీ నేతృత్వంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాష్, వైస్ చైర్మన్ సూరు కుమార్, సభ్యులు వంకల కృష్ణ, కంది శ్రీరాములు, ఎ.రవి తదితరులు పాల్గొన్నారు.